క్లుప్తంగా

అభివృద్ధి పనులకు ఆమోదం



జరుగుతున్న కౌన్సిల్ సమావేశం

సాలూరు: మున్సిపాల్టీలో గుర్తించిన అభివృద్ధి పనులకు సభ్యులు ఆమోదం తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన, కమిషనర్ శంకరరావు ఆధ్వర్యంలో మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వార్డుల్లో సమస్యల పరిష్కారం, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కౌన్సిలర్లు చర్చించారు. అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ జర్జాపుదీప్తి, వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సీతానగరం: మండలంలోని బూర్జ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సాంకేతిక పరమైన కారణాల వల్ల శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఏఈ సోమేశ్వరరావు తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీతానగరం నుంచి బూర్జ సబ్‌స్టేషన్‌కు వెళ్తున్న హై పవర్ లైన్ పెట్రోలింగ్, సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టవలసి ఉందన్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం 8 గంటలనుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ఆ తరువాత యథావిధిగా నాణ్యమైన విద్యుత్ సరఫరా ఉంటుందని చెప్పారు. అందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పట్టణాభివృద్ధికి సహకరించాలి

- మున్సిపల్ ఆర్ఐ నారాయణరావు



యూజర్ చార్జీలు వసూలు చేస్తున్న మున్సిపల్ ఆర్ఐ

పార్వతీపురంటౌన్: పట్టణ ప్రజలంతా యూజర్ చార్జీలు చెల్లించి పట్టణాభివృద్ధికి కృషిచేయాలని మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నారాయణరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని వాణిజ్య సముదాయాల్లో వన్నులు, ప్రాపర్టీ చార్జీల వసూలు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూజర్‌చార్జీలు చెల్లించడం ద్వారా పట్టణాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు, పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన నిధులు సమకూరుతాయన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీఓగా విజయలక్ష్మి



విజయలక్ష్మి

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మండల అభివృద్ధి అధికారిణిగా విజయలక్ష్మి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఎంపీడీఓగా విధులు నిర్వహించిన జావేద్ శిక్షణ నిమిత్తం విజయవాడకు వెళ్లారు. ఆయన స్థానంలో విజయనగరం జిల్లా పరిషత్‌లో విధులు నిర్వహిస్తున్న విజయలక్ష్మి ఎంపీడీఓగా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. మండలాభివృద్ధికి తన బాధ్యతగా కృషి చేస్తానని ఆమె ఈ సందర్భంగా తెలిపారు.

ఆక్రమణల తొలగింపు



కోనేరు గట్టుపై ఆక్రమణలు పరిశీలిస్తున్న డీటీ

పాలకొండ: నగర పంచాయతీలోని రాయుడు కోనే రు గట్టుపై ఆక్రమణలను తొలగించేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా కోనేరు గట్టుపై పాకలు వేసుకుని వినియోగిస్తున్నారు. ఇటీవల సబ్ కలెక్టర్ ఈ ప్రాంతంలో సందర్శించిన సమయంలో పాకలను గుర్తించి వెంటనే తొలగించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. దీనిపై ఆక్రమణదారులు స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లను కలసి గోడు వినిపించారు. దీంతో కొన్ని రోజుల పాటు సమయం కావాలని సబ్ కలెక్టర్‌ను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు కోరారు. ఆక్రమణదారులు పేదలు కావడంతో వారికి ప్రత్యామ్నాయం కల్పించాలని వివరించారు. శుక్రవారం మరోమారు టీడీ బి.బుచ్చయ్య ఆధ్వర్యంలో పాకలను తొలగించే ప్రయత్నం చేశారు. మరో రోజు సమయం కావాలని ఆక్రమణదారులు కోరడంతో పాకల తొలగింపు నిలిపివేశారు.

ఈదురుగాలులతో భారీ నష్టం

- నేలకొరిగిన జీడి, మొక్కజొన్న, అరటి
- లబోదిబోమంటున్న రైతన్నలు



కొండబుచ్చమ్మపేట వద్ద నేలకొరిగిన మొక్కజొన్న



గైశీల గ్రామం సమీపంలో నేలకొరిగిన జీడిచెట్లు



మార్కొండపుట్టి సమీపంలో గాలికి విరిగిన అరటి

మక్కువ:

ఆరుగాలం శ్రమించి, పండించిన పంట ఈదురుగాలులతో కూడిన అకాలవర్షాలకు నేలపాలవడంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. మండలంలో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులుతో కూడిన వర్షం పడడంతో పంటలన్నీ నేలకొరిగాయి. జీడి, మొక్కజొన్న, అరటి పంటలు చేతికి అందివచ్చే సమయంలో ప్రకృతిప్రకోపానికి గురి కావడంతో రైతులు ఆవేదనచెందుతున్నారు. మండలంలోని గైశీల గ్రామానికి చెందిన కరుటూరి రామారావుకు చెందిన జీడితోటలో సుమారు 40చెట్లు వేళ్లతో పాటు నేలకొరిగాయి. జీడిపిక్కలు పక్వానికి వచ్చే సమయంలో చెట్లు విరిగిపోవడంతో చాలావరకు నష్టపోతున్నామని ఆయన వాపోయాడు. అలాగే కొండబుచ్చమ్మపేట, సరాయివలస గ్రామాలకు చెందిన రైతులు సాగుచేస్తున్న మొక్కజొన్న పంట నేలకొరిగింది. మొక్కజొన్న కండెలు లేతవయసులో నేలపాలవడంతో లక్షలాది రూపాయలు నష్టపోయామని సంబంధిత రైతులు లబోదిబోమంటున్నారు. అలాగే మార్కొండపుట్టి, నందబొడ్డవలస, నంద తదితర గ్రామాలలో అరటిపంట నేలపాలైంది. మార్కొండపుట్టి గ్రామంలో రహదారికి అడ్డంగా చెట్లు నేలకొరగడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. గ్రామస్తులు జేసీబీ సహాయంతో రహదారికి అడ్డంగా ఉన్న చెట్లను తొలగించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంటనష్టం అంచనావేసి, ప్రభుత్వానికి నివేదిక అందించాలని రైతులు కోరుతున్నారు.

పది పరీక్షలకు సిద్ధం

- 3వ తేదీ నుంచి ప్రారంభం



వంతరాం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు

బలిజిపేట:

పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. ఏడాదంతా కష్టపడి చదివిన పాఠ్యాంశాలనుంచి వచ్చిన ప్రశ్నలకు బాగా జవాబులు రాసి మంచి మార్కులు సాధించాలనే పట్టుదలతో విద్యార్థులు ఉన్నారు. ఏప్రిల్ 3నుంచి పది పరీక్షలు ప్రారంభమవుతాయి. బలిజిపేట మండలంలో బలిజిపేట ఉన్నత పాఠశాలలో కేంద్రం–ఎ లో 178మంది, కేంద్రం–బిలో 182మంది, కొత్తగా మంజూరైన వంతరాం కేంద్రంలో 125మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

పరీక్షల టైమ్‌టేబుల్

ఏప్రిల్ 3న తెలుగు, కాంపోజిట్ పేపర్, 6న హిందీ, 8న ఇంగ్లీషు, 10న గణితం, 13న సైన్స్(ఫిజికల్, బయాలజి), 15న సోషల్‌స్టడీస్ పరీక్ష జరుగుతాయి. ఉదయం 9.30 గంటనుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు.

భూ సమస్యలపై సబ్ కలెక్టర్ విచారణ



భూ రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరల్ కమర్

వీరఘట్టం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీ సర్వేతో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తొందని పాలకొండ సబ్ కలెక్టర్ నూరల్ కమర్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలపై బాధితులు ఆర్ఓఆర్(రికార్డ్స్ ఆఫ్ రైట్స్)లో ఫిర్యాదు చేశారు. ఈ భూ సమస్యలు పరిష్కరించేందుకు స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి శుక్రవారం సబ్ కలెక్టర్ వచ్చారు. ఆయన ఇరు వర్గాల వారిని పిలిపించి విచారణ చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. తలవరం గ్రామానికి చెందిన యెన్ను సన్యాసమ్మకు తూడి గ్రామంలో సర్వే నంబర్ 285–2లో ఎ 1.12 ఎకరాల భూమి, సర్వే నంబర్ 287–4లో ఎ 1.39 ఎకరాల భూమి ఉంది. ఈ మొత్తం భూమిని తూడి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు తప్పుడు ధ్రువపత్రాలతో అతని కుటుంబ సభ్యుల పేరిట భూమిని మార్చుకుని తప్పుడు పత్రాలతో బ్యాంకు రుణాలను తీసుకుని అనుభవిస్తున్నాడని సన్యాసమ్మ ఫిర్యాదు చేసింది. చిట్టపులివలస గ్రామానికి చెందిన గుంట్రెడ్డి చిన్నంనాయుడుకు శ్రీహరిపురం రెవెన్యూ పరిధిలో ఉన్న 3 ఎకరాల భూమి పరాదీనంలో ఉందని, ఆ భూమిని తన పేరిట వచ్చేలా చూడాలని కోరారు. ఇలా కత్తుకవిటి, నీలానగరం, తలవరం గ్రామాలకు చెందిన పలువురు భూ సమస్యలపై చేసిన ఫిర్యాదులపై సబ్ కలెక్టర్ విచారణ చేపట్టారు. రాజీ మార్గం ద్వారా కొని భూసమస్యలు పరిష్కరించుకోవచ్చునని సూచించారు. కొందరు మాత్రం తమ సమస్యలను కోర్టులో తేల్చుకుంటామన్నారు.

శిలువ యాత్ర



శిలువపై విశ్వాసకుడు ప్రదర్శన

భామిని: పాప పరిహారానికే శిలువ యాత్ర నిర్వహిస్తున్నట్టు చర్చి ఫాదర్లు రాజు, చార్లెస్ ప్రబోధించారు. మండల కేంద్రలో క్రైస్తవ దీక్షాపరులు శుక్రవారం నిర్వహించిన శిలువ యాత్రలో వారు పాల్గొని మాట్లాడారు. యాత్రలో భామిని, లివిరి, బత్తిలి దీక్షాపరులు, విశ్వాసకులు పాల్గొని భక్తిగీతాలు విలపించారు. సర్పంచ్ లోపింటి రాజేశ్వరి, మాజీ సర్పంచ్ లోపింటి జయమ్మ, విశ్వాసకులు పాల్గొన్నారు.

15ఏళ్ల నాటి కాలనీ ప్రజల సమస్య పరిష్కారం

- ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు కృతజ్ఞతలు తెలుపుకున్న ప్రజలు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పురపాలక సంఘంలోని 20వ వార్డుకు చెందిన సుందర నారాయణపురం కాలనీ ప్రజలు వారి నివాసాల ముందు సీసీ కాలువలు, రోడ్డు నిర్మాణం వంటి మౌలిక సదుపాయాలు కల్పించమని 15 ఏళ్లుగా ఎంతోమందిని వేడుకున్నారు. కానీ ఫలితం లేకపోయిందని, ఎమ్మెల్యే అలజంగి జోగారావు నాయకత్వంలో తమకు న్యాయం చేకూరుతోందని, సుదీర్ఘకాలం నాటి సమస్యలకు పరిష్కారం లభిస్తున్నందున చాలా సంతోషంగా ఉందని అన్నారు. కాలనీలో అభివృద్ధి పనులను పరిశీలించడానికి విచ్చేసిన ఎమ్మెల్యే జోగారావుకు కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలుపుకున్నారు. అభివృద్ధి పనుల పరిశీలన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల తాను గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఈ ప్రాంతానికి విచ్చేసిన సమయంలో ఇక్కడి సమస్యను నాదృష్టికి మీరంతా తీసుకు వచ్చారని ఆ రోజున మీకు ఇచ్చిన మాట ప్రకారం అనతికాలంలోనే సీసీ కాలువలు, రోడ్డు నిర్మాణం చేపట్టి ఇచ్చిన మాటను నెరవేరుస్తున్నామని చెప్పారు. అందరికీ సంతోషమే కదా అని అడగ్గా తామంతా చాలా సంతోషంగా ఉన్నామని మీ ద్వారా సీఎం వైఎస్‌జగన్ మోహన్ రెడ్డికి కూడా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు పురపాలక సంఘం ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల భజన కార్యక్రమం

భామిని:

మండలంలోని మనుమకొండలో వెలసిన కోదండ రామాలయంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా శుక్రవారం అక్షర బ్రహ్మ భజన మండలి ఆధ్వర్యంలో ఆదివాసీ గిరిజనులు భజన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం వారితో మమేకమై భక్తి గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట శాంతికుమారి, కాట్రగడ సర్పంచ్ తోట సరస్వతి, ఎంపీటీసీ పత్తిక మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నిమ్మల నిబ్బరం, సర్పంచ్ నిమ్మల కేశవ పాల్గొన్నారు.



ఆదివాసీల భజన

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పాలవలస రాజశేఖరంతో కలసి విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం/పాలకొండ: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. పాలకొండలోని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖరంతో కలసి ఆయన స్వగృహంలో విలేకర్లతో వారు శుక్రవారం మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా ఖాళీగా ఉన్న వీరఘట్టం మార్కెట్ యార్డ్‌లో మినీ రైతుబజారు నిర్మించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. వీరఘట్టంలో అధిక సంఖ్యలో కాయగూరల సాగు జరుగుతున్నప్పటికీ ధరలు అందనంతగా ఉన్నాయని, రైతు బజారు అందుబాటులోకి వస్తే కాయగూరల ధరలు సామాన్యులకు అందుబాటులోకి వస్తాయన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో పాలకొండ నియోజకవర్గంలోని పలు సమస్యలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డితో చర్చించడం జరిగిందని, ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ తొలుత రైతుబజారు నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్నారు. వీరఘట్టం ప్రధాన రహదారి నిర్మాణాన్ని కూడా శరవేగంగా చేపట్టేందుకు బిల్లులు మంజూరు చేశారన్నారు. విజయనగం, పార్వతీపురం జిల్లాలను అనుసంధానం చేస్తూ వీరఘట్టం – వంగర మండలాలను కలుపుతూ కిమ్మి, రుషింగి గ్రామాల మధ్య నాగావళి నదిపై రూ.29.5 కోట్ల వ్యయంతో నిర్మించిన వంతెన పనులు పూర్తయ్యాయని, ఈ వంతెన ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆహ్వానించి ఈ ప్రాంతం ప్రజలతో ముఖ్యమంత్రి నేరుగా మాట్లాడేందుకు ఓ కార్యక్రమాన్ని త్వరలో నిర్వహిస్తామన్నారు. ఏప్రిల్ 30 నుండి మే 10వ తేదీ వరకు జరగనున్న వీరఘట్టం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి పండుగలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. వీరఘట్టం ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు భోగి మణి, బూరాడ చిన్న, కెంగువ ఆంజనేయులు, భోగి మదన్ తదితరులున్నారు.

పట్టణాభివృద్ధికి సహకరించాలి

- మున్సిపల్ ఆర్ఐ నారాయణరావు

పార్వతీపురంటౌన్: పట్టణ ప్రజలంతా యూజర్ చార్జీలు చెల్లించి పట్టణాభివృద్ధికి కృషిచేయాలని మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నారాయణరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని వాణిజ్య సముదాయాల్లో వన్నులు, ప్రాపర్టీ చార్జీల వసూలు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూజర్‌చార్జీలు చెల్లించడం ద్వారా పట్టణాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు, పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన నిధులు సమకూరుతాయన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా ఎంఎల్ఎన్ ప్రసాద్



ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎంఎల్ఎన్ ప్రసాద్‌ను నియమిస్తూ జెడ్పీ సీఈఓ కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు రావడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకూ ఎంపీడీఓగా విధులు నిర్వహించిన బి.కృష్ణమహేష్ రెడ్డి 2018 ఏపీపీఎస్సీ ద్వారా నియమితులయ్యారు. ఆయన వివిధ రకాల కోర్సులపై శిక్షణ పొందవలసి ఉన్నందున ఆరు నెలల విధి నిర్వహణలో వెళ్తున్న కారణంగా ఇక్కడి కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వహిస్తున్న ప్రసాద్ ఎంపీడీఓగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎంపీడీఓ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలందిస్తానని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అమలయ్యేలా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ, సీనియర్ సహాయకులు నాని, జూనియర్ సహాయకులు జి శేఖర్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

'జగనన్న మా భవిష్యత్'ను విజయవంతం చేయాలి



బలిజిపేటలో పార్టీ కార్యాలయం వద్ద కన్వీనర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: 'జగనన్న మా భవిష్యత్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే జోగారావు కన్వీనర్లకు సూచించారు. ఈ మేరకు బలిజిపేటలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద కన్వీనర్లు, నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం పార్టీ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ముందుగా ఈ నెల 1నుంచి 5వ తేదీ లోగా సచివాలయాల్లో జగనన్న మా భవిషత్ కార్యక్రమంపై కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో సమాయత్త సమావేశం నిర్వహించాలన్నారు.

7వ తేదీన కార్యక్రమం ప్రారంభోత్సవాన్ని ఘనంగా చేపట్టాలని కోరారు. పార్టీ కేడర్ ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకునేలా వ్యవహరించాలని హితవు పలికారు. 14వ తేదీన ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, గృహసారథులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురంలో..

పార్వతీపురం టౌన్: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంపై గ్రామ, వార్డు సచివాలయ కన్వీనర్లకు అవగాహన తప్పనిసరి అని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన అధ్యక్షతన పార్వతీపురం మండలం పరిధిలోగల సచివాలయం కన్వీనర్లు వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసి క్యాంపు కార్యాలయంలోను అలానే పార్వతీపురం అర్బన్‌కు సంబంధించి మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక సమావేశం కార్యక్రమం షెడ్యూల్‌పై దిశానిర్దేశం చేశామన్నారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం వచ్చే నెల ఏప్రిల్ 7వతేదీన రాష్ట్ర వ్యాప్తంగా 15 వేల పైచిలుకు గ్రామ, వార్డు సచివాలయాలలో ప్రారంభం కాబోతుందన్నారు. ప్రచార కార్యక్రమం విధి విధానాలపై అవగాహన కల్పించారు. వారం రోజుల పాటు గ్రామ, వార్డు సచివాలయం కన్వీనర్లు గృహసారథులతో కలిసి డోర్ టు డోర్ కార్యక్రమం ఏప్రిల్ 14 తేదీ వరకు నిర్వహించనున్న నేపథ్యంలో పార్టీ ఆదేశానుసారం ప్రచార కార్యక్రమం షెడ్యూల్‌ను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలకు పరిష్కారం కోరుతూ ఆర్డీఓకు వినతిపత్రం

- ఆర్డీఓకు ఎమ్మెల్యే వినతిపత్రం



ఆర్డీఓ హేమలతకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: నియోజకవర్గంలో గల రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్డీఓ హేమలతను ఎమ్మెల్యే అలజంగి జోగారావు శుక్రవారం ఆమె కార్యాలయంలో గౌరవ పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేసి అభ్యర్థించారు. సమస్యలలో ప్రధానంగా 1964లోనే ఏర్పాటైన బలిజిపేట గ్రామం ఇప్పటికీ పలగర గ్రామ రెవెన్యూ పరిధిలోనే ఉండడం చేత ప్రజలు పలు సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోందని, కావున పలగర రెవెన్యూ నుంచి బలిజిపేట రెవెన్యూ క్లస్టర్ వేరుచేసి ఆన్‌లైన్‌లో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలో 90 రోజుల గడువుతో కూడుకున్న ఇళ్ల పట్టాలు మంజూరుకు అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని వినతిపత్రంతో పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పార్వతీపురం పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, బలిజిపేట మండల సీనియర్ నాయకులు బండారు సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పరంగా అమ్మవారి జాతర

- మున్సిపల్ సమావేశంలో తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: పట్టణంలో వచ్చే నెలలో జరగనున్న అమ్మవారి పండగను ప్రభుత్వపరంగా నిర్వహించాలని కోరుతూ మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ మేరకు శుక్రవారం పార్వతీపురం పురపాలకసంఘం చైర్మన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన పాలకసంఘం సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే అలజంగి జోగారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్వతీపురం పట్టణ సమగ్ర అభివృద్ధిపై సాగిన కౌన్సిల్ సమావేశంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రవేశపెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. అనంతరం జిల్లా కేంద్రంలో అమ్మవారి పండగను మే నెలాఖరులో నిర్వహించనున్న దృష్ట్యా ఈ పండగను ప్రభుత్వ పరంగా నిర్వహించాలని కోరుతూ కౌన్సిల్ సభ్యులందరూ ఏకగ్రీవంగా తీర్మానం కలెక్టర్‌కు పంపించారు. ఈ అంశంపై దేవాదాయ, ధర్మాదాయ శాఖాధికారులు, కలెక్టర్‌తో ఎమ్మెల్యే జోగారావు చర్చించి జిల్లా కేంద్రంలో మొట్టమొదటిసారిగా జరగనున్న అమ్మవారి పండగను శంబర పోలమాంబ, విజయనగరం పైడితల్లమ్మ పండగలా నిర్వహించేందుకు ప్రభుత్వ పరంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో పలువురు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

పంట నష్టాల నమోదు

భామిని: మండలంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలతో పాడైన పంట నష్టాల గుర్తింపునకు అధికారులు నడుం కట్టారు. శుక్రవారం బాలేరు – సొలికిరి గ్రామాల పరిధిలో వీఆర్‌ఓ గెల్లంకి వెంకటరమణ, వ్యవసాయ సహాయకురాలు జ్యోతి ఆధ్వర్యంలో పంట నష్టాలను గుర్తించారు. ముంపుకు గురైన రబీ వరి, మొక్కజొన్న, కూరగాయలు, నువ్వులు, అపరాల వంటి పంటలను గుర్తించారు.

కొంగల కనువిందు



తన పొలంలో ఓ రైతు శుక్రవారం ఇలా ట్రాక్టర్‌తో దున్నుతున్నాడు. దుక్కు పట్టడంతో భూమిలో ఉండే కొన్ని కీటకాలు, పురుగులు, వడ్ల గింజలు పైకి రావడంతో వాటితో తమ కడుపు నింపుకునేందుకు పెద్ద సంఖ్యలో కొంగలు ఎగబడ్డాయి. ఇదే సమయంలో కొంగలను కొల్లగొట్టేందుకు రాబంధులు రావడంతో ఒక్కసారిగా ప్రాణభయంతో కొంగలు ఎగిరిపోయాయి. వీరఘట్టం మండలం యు.వెంకమ్మపేట వద్ద ఓ రైతు పొలంలో ఈ అందమైన దృశ్యం సాక్షి కెమెరాకు ఇలా చిక్కింది.
– వీరఘట్టం